సాక్షి
జనగామ
గురువారం । 25 । జూలై । 2024



నిలకడగా ఉభయ నదులు..
మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల కారణంగా ఉభయ నదులు ప్రాణహిత, గోదావరి వరద నిలకడగా కొనసాగుతోంది. - 8లో▸



పిల్లలపై ఒత్తిడి పెంచొద్దు
తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి పెంచొద్దు. సహనం పాటిస్తే సత్ఫలితాలు వస్తాయని అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు విద్యాధర్ అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$31^0/25^0$

వాతావరణం
ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

శ్రీసోమేశ్వరాలయంలో సంకటహర చతుర్థి పూజలు



పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థిని పురస్కరించుకొని శ్రీమహా గణాధిపతి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రదోషకాల గణపతి ఉపనిషత్తులతో అభిషేకం, గరక దండ అలంకరణ, నీరాజనం, మంత్రపుష్పం వైభవంగా చేపట్టారు. ఈఓ లక్ష్మీప్రసన్న ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

బచ్చన్నపేట : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల ఆరోగ్యంపై టీచర్లు శ్రద్ధ పెట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక బీడీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన.. గర్భిణులు, బాలింతలకు అందజేసే పౌష్టికాహారం, గుడ్లు, నెలవారీగా పంపిణీ చేసే సరుకుల నిర్వహణ రికార్డులు, పిల్లల బరువును పరిశీలించారు. అనంతరం వినోద్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పౌష్టికాహారం అందరికీ అందిచేలా చూడాలని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్ ఘనపురం కవిత, పంచాయతీ కార్యదర్శి అనిల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో పోలీస్ అధికారుల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు పోలీస్ అధికారులను బదిలీ చేస్తూ.. సీపీ అంబర్ కిషోర్ ఝా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 13 మంది ఏఎస్సైలు, 40 మంది హెడ్ కానిస్టేబుళ్లు, నలుగురు కానిస్టేబుళ్లను కౌన్సెలింగ్ పద్ధతిలో వారు ఎంపిక చేసుకున్న పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేస్తూ.. సీపీ ఉత్తర్వులు ఇచ్చారు.

నవోదయ ఎంపిక పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరం 6వ తరగతిలో ప్రవేశ ఎంపిక పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. సీబీఎస్ఈ సిలబస్, ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఇంటర్ వరకు ఉచిత విద్య ఉంటుందని పేర్కొన్నారు. 5వ తరగతి పూర్తి చేసిన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75శాతం, పట్టణ ప్రాంతం వారికి 25 శాతం రిజర్వేషన్ ఉంటుందన్నారు. నిబంధనల మేరకు ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, బాలికలకు రిజర్వేషన్‌పై సీట్లు కేటాయిస్తారని తెలిపారు. సెప్టెంబర్ 9వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష 2025 జనవరి 18న ఉంటుందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలి



జనగామ రూరల్: డ్రైవర్లు విధి నిర్వహణలో తగిన జాగ్రతలు పాటించాలని ఆర్టీసీ డీపో మేనేజర్ ఎస్.స్వాతి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రం డిపో పరిధిలో ప్రమాద రహిత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్డుపై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై ఆదికేశవులు, అసిస్టెంట్ మేనేజర్ డి.హుస్సెన్, అజయ్, మెకానికల్ ఫోర్‌మెన్ యాదమణిరావు, సమ్మయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయాలి

జనగామ రూరల్: ఎమ్మార్పీఎస్‌ను క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసి అనుబంధ సంఘాల నిర్మాణం చేపట్టాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు గద్దెల కిషోర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓంసాయి గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యాన అనుబంధ సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌తో 30 సంవత్సరాల నుంచి చేస్తున్న పోరాటం సాకారం కానుందని, ఆగస్టు చివరి వారంలో సుప్రీం కోర్టులో వర్గీకరణకు అనుకులంగా తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు రవీందర్, సుధాకర్, కుమార్, సోమరాజు, కొడిదేటి కుమార్, అబ్బయ్య, రవి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌సీ, ఎఫ్‌ఎఫ్‌సీ నిధులు బంద్

జనాభా లెక్కల ప్రకారం ఒక వ్యక్తికి రూ.816, ఎస్సీఎస్టీలు అయితే రూ.1016 ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌ఎఫ్‌సీ(స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్) ద్వారా.. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌ఎఫ్‌సీ(ఫిఫ్టీన్త్ ఫైనాన్స్ నిధులు) ద్వారా విడుదల చేయాలి. 15 ఆర్థిక సంఘం నిధులు 2023–23 సంవత్సరానికి సంబంధించి సుమారు రూ.1.80 లక్షలకు ఇంకా రూ.50 లక్షల వరకు రావాల్సి ఉంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.కోటి 80 లక్షలకు ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా రాలేదు. 2022 సంవత్సరం నుంచి సుమారు రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఎస్‌ఎఫ్‌సీ నిధులు కూడా ఇవ్వలేదు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో అప్పటి నుంచి నిర్వహణ భారం కార్యదర్శులపై పడింది.

అయ్యవారిగూడెం గ్రామంలో బోరు మోటారు రిపేరు చేస్తున్న సిబ్బంది



కొత్త పంచాయతీలకు తప్పని కష్టాలు..

ఎలాంటి ఆర్థిక వనరులు లేని కొత్త గ్రామ పంచాయతీల నిర్వహణ మరింత అధ్వానంగా మారుతోంది. కేవలం ఇంటి, నల్లా పన్నులతోనే నెట్టుకురావాల్సి వస్తోంది. అందులో పన్నుల వసూలు అంతంత మాత్రంగానే ఉండడం, ఒకవేళ వంద శాతం వసూలైనా వచ్చే ఆదాయం వేలల్లోనే ఉండి ఎటూ సరిపోవడంలేదు. ఒకసారి తాగునీటి బోరు మోటారు కాలిపోతే మరమ్మతుకు రూ.7వేల నుంచి రూ.8వేల ఖర్చవుతుంది. ఇలా ఏడాదిన్నరగా కాలిన మోటార్లకు ఖర్చు పెట్టాల్సి వచ్చింది. వీధిలైట్ల కరెంట్ బిల్లులు చెల్లించకపోతే ఇబ్బందులే. వానాకాలం పారిశుద్ధ్య పనుల నిర్వహణ సరిగాలేకపోతే దోమలు, ఈగలతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. వీటికి తోడు రోజువారీగా చెత్త సేకరణ, ట్యాంకర్లతో మొక్కలకు నీరు పోయడానికి ట్రాక్టర్‌లో డీజిల్ తప్పడంలేదు. వీటి భారమంతా గ్రామాల కార్యదర్శులపై పడుతోంది.

కాసుల కటకట



జీపీలకు నిర్వహణ భారం

- రెండేళ్లుగా నిలిచిన ఎస్‌ఎఫ్‌సీ ఫండ్స్
- ఎఫ్‌ఎఫ్‌సీ నిధుల పరిస్థితీ అలాగే ఉంది
- సొంత డబ్బులతో వెల్లదీస్తున్న కార్యదర్శులు
- కొత్త గ్రామాల్లో ఇబ్బందులు రెట్టింపు

లింగాలఘణపురం: గ్రామ పంచాయతీలకు రెండేళ్లుగా అటు కేంద్రం నుంచి ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు బంద్ అయ్యాయి. దీంతో జీపీల నిర్వహణ పంచాయతీ కార్యదర్శులకు రోజురోజుకూ భారంగా మారుతోంది. తాగునీటి బోరు మోటార్ల మరమ్మతులు, పారిశుద్ధ్య పనులు, వీధిలైట్ల విద్యుత్ బిల్లులతో పాటు ట్రాక్టర్ డీజిల్‌కు రోజువారీ తదితర ఖర్చులన్నీ తడిసిమోపెడవుతున్నాయి. ఇప్పటికే ఒక్కో కార్యదర్శి రూ.30వేల నుంచి రూ.50వేల వరకు సొంతంగా ఖర్చు పెట్టారు. నిన్నమొన్నటి వరకు పంచాయతీ సిబ్బంది వేతనాలకు కూడా ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో ఇటీవల వారి జీతభత్యాలు విడుదలైనట్లు ఉత్తర్వులు వచ్చినా ఇంకా డబ్బులు చేతికి అందలేదు. జిల్లాలో మొత్తం 281 గ్రామపంచాయతీలు ఉండగా.. అందులో 81 కొత్తగా ఏర్పడిన జీపీలు. ఇందులో మేజర్ పంచాయతీలకు ఆదాయ వనరులున్నాయి కాబట్టి పెద్దగా ఇబ్బందులు లేవు. అయితే చిన్న జీపీలు, కొత్తగా ఏర్పాటైన పంచాయతీల పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది.

సొంతంగా రూ.50వేలు ఖర్చు పెట్టా..



రెండేళ్లుగా ప్రభుత్వం నుంచి ఒక్కపైసా రావడంలేదు. ఇప్పటికే రూ.50వేలు సొంతంగా ఖర్చు పెట్టాను. మోటారు రిపేర్లు, శానిటేషన్ తదితర పనుల నిర్వహణ తప్పడంలేదు. ఆదాయ వనరులు ఎక్కడి నుంచి వచ్చేవి లేవు. ఇంటి పన్నులు కూడా అంతంత మాత్రమే. నానా తంటాలు పడుతున్నాం.

– సాయి, పంచాయతీ కార్యదర్శి, పటేల్‌గూడెం

బాధలు ఎవరికి చెప్పుకోవాలి..



మోటారు కాలింది.. రిపేర్ చేయించాలె. జీపీలో పైసలు లేవు. జేబు నుంచి ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుంది. ఇప్పటికే రూ.10వేల నుంచి రూ.15వేలు పెట్టాను. తప్పడంలేదు. ఏం చేయాలి. చిన్న గ్రామంలో మేము పడుతున్న బాధలు ఎవరికి చెప్పుకోవాలి.

– కనకం విజయ్, కార్యదర్శి, అయ్యవారిగూడెం(రఘునాథపల్లి)

నిధులు విడుదలైనప్పుడు వస్తాయి..



ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైనప్పుడు వస్తాయి. గతంలో వచ్చిన ఎఫ్‌ఎఫ్‌సీ నిధులు కొంత మంది కార్యదర్శులు ఇతర పనులకు వినియోగించడంతో ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది ఖర్చు చేయకుండా ఉండడంతో ప్రస్తుతం నిర్వహణకు అంత ఇబ్బంది లేదు. ఏది ఏమైనా ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే తప్పకుండా వస్తాయి.

– అనిల్‌కుమార్, జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీపీఓ

గెటవుట్ ఫ్రం హియర్..

డీఎల్‌పీఓపై అదనపు కలెక్టర్ ఫైర్

- మెమో జారీ చేయాలని డీపీఓకు ఆదేశం
- అక్రమాలపై విచారణ విషయంలో వాగ్వాదం



జీపీలో విచారణ నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

రఘునాథపల్లి: 'చెప్పిన పని చేయవా..? నువ్వున్నది ఎందుకు..? పని చేయలేననుకుంటే గెటవుట్ ఫ్రం హియర్' అంటూ డీఎల్‌పీఓపై అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రఘునాథపల్లి గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు.. జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.. విచారణ చేపట్టి బాధ్యులందరిపై చర్య తీసుకోవాలని మండల కేంద్రానికి చెందిన ఠాకూర్ గ్యానేష్‌సింగ్, శాడ శ్రీనివాస్ వేర్వేరుగా హైదరాబాద్ సచివాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పలుమార్లు ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ విచారణ నిమిత్తం బుధవారం పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. ఆయన వస్తున్న విషయం తెలుసుకొని డీపీఓ, ఇతర అధికారులు కార్యాలయానికి వచ్చారు. డీఎల్‌పీఓ పార్థసారధి రాక పోవడంతో అదనపు కలెక్టర్ తన వ్యక్తిగత సహాయకుడితో ఫోన్ చేయించి రప్పించారు. ఫిర్యాదులపై మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని డీఎల్‌పీఓను ఆదేశించగా.. పై అధికారులపై తాను ఎలా విచారణ జరుపుతాను..? మూడు రోజుల్లో నివేదిక ఇవ్వడం ఎలా సాధ్యమవుతుంది సార్? అని పార్థసారధి పేర్కొన్నాడు. దీంతో ఆగ్రహించిన అదనపు కలెక్టర్.. నాకు ఎదురు చెబుతావా అంటూ.. డీఎల్‌పీఓను బయటకు పంపాలని పోలీసులకు సూచించారు. స్థాయికి మించిన పని నాకు చెబితే ఎలా..? ఏం చేస్తారో చేసుకోండని డీఎల్‌పీఓ అన్నాడు. దీంతో ఆయనకు మెమో జారీ చేసేలా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాలని డీపీఓ అనిల్ కుమార్‌ను ఆదేశించారు. రఘునాథపల్లిలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టి మూడు రోజుల్లో నివేదిక అందజేయాలని పంచాయతీ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. విచారణలో డీపీఓ అనిల్‌కుమార్, ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, తహసీల్దార్ పురం యుగేందర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు ఆహ్లాదకరంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



కేసిరెడ్డిపల్లి పాఠశాలలో మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

బచ్చన్నపేట: పాఠశాలలు పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉండాలి.. ఇందుకు ఆవరణలో మొక్కలు నాటాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధి కేసిరెడ్డిపల్లి, నాగిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలు, గ్రామాల్లోని వీధులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పౌష్టికాహారం, గుడ్లను పరిశీలించారు. అలాగే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ రోడ్లకు ఇరువైపులా ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని చెప్పారు. పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రగతిని తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రఘురామకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు, నోడల్ అధికారి వెంకట్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు అనిల్‌రాజ్, రామకృష్ణ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు ముందుకురావాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



ఆయిల్‌పామ్ పంట సాగుకు సంబంధించి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

లింగాలఘణపురం: ఆయిల్ పామ్ పంట లాభదాయకంగా ఉంటుంది.. సాగు చేయడానికి రైతులు ముందుకురావాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మండల పరిధి వనపర్తిలో బోయినపల్లి రేణుక, నితీష్‌రావు మూడేళ్ల క్రితం సాగు చేసిన ఆయిల్ పామ్ పంటను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సాగులో రైతుల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది జిల్లాలో ఆయిల్ పామ్ సాగు లక్ష్యం 3వేల ఎకరాలు కాగా.. ఇప్పటికే 440 ఎకరాల్లో పంట వేశారని చెప్పారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. అంగన్‌వాడీలో పిల్లల ఎత్తుకు తగిన బరువు ఉన్నారా లేదా అనే విషయాలను తెలుసుకున్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అమ్మ ఆదర్శ కమిటీ పాఠశాలల్లో చేపడుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. కలెక్టర్ వెంట డీఈఓ రాము, డీఏఓ వినోద్‌కుమార్, డీహెచ్‌ఓ కేఆర్.లత, డీడబ్ల్యూఓ జయంతి, నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి, తహసీల్దార్ వినయలత, ఏఓ వెంకటేశ్వర్లు, హెచ్ఈఓలు ఉన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

దేవరుప్పుల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పంట రుణమాఫీ రైతులకు వర్తింపజేసి సత్వరమే రుణాలు ఇవ్వడంలో సాంకేతిక ఇబ్బందులు లేకుండా బ్యాంకర్లు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం ఏపీజీవీ బ్యాంకు సింగరాజుపల్లి శాఖను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ కత్తి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రెండు రోజులుగా సాంకేతిక కారణాలతో రుణమాఫీ ప్రక్రియకు ఇబ్బందులు ఏర్పడ్డాయని, సమస్యను పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తను ఆధార్ నంబర్ మరో రైతుకు అనుసంధానం చేయడంతో తనకు జరిగిన నష్టాన్ని బాధితుడు దాసగాని బిక్షపతి అనే రైతు వివరించగా.. సహకార బ్యాంకర్లు ఇలాంటి తప్పిదాలు ఉంటే సత్వరమే సవరించాలని కలెక్టర్ ఆదేశించారు.

రిటైర్మెంట్ ప్యాకేజీ పెంచాలి

- అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల నుంచి పెరుగుతున్న డిమాండ్
- ఉద్యోగ విరమణ ప్రకటించిన సర్కారు
- ఖాళీల భర్తీపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం

స్టేషన్‌ఘన్‌పూర్: రిటైర్మెంట్ ప్యాకేజీ పెంచాలనే డిమాండ్ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల నుంచి పెరుగుతోంది. వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రిటైర్మెంట్ తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి వయసు 65 ఏళ్లు నిండిన వారికి రిటైర్మెంట్ ఇవ్వాలని సంబంధిత శాఖకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ సంయుక్త సంచాలకులు జీఓ జారీ చేశారు. జిల్లాలో మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 695 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో 57 మంది ఆయాలు, నలుగురు అంగన్‌వాడీ టీచర్లు ఉద్యోగ విరమణ పొందారు.



ఖాళీల భర్తీ ఎప్పుడో..

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంతకు ముందున్న ఖాళీలతోపాటు ప్రస్తుతం రిటైర్మెంట్‌తో అయ్యే ఖాళీల భర్తీపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసిన నేపథ్యంలో ఖాళీల పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. రిటైర్మెంట్ నిర్ణయంతో ఆయాలు, టీచర్లు ఖాళీ అయిన సెంటర్లలో చిన్నారులకు విద్యాబోధన, గర్భిణిలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ ఎలా చేస్తారనేది తెలియడంలేదు.

మంత్రి ప్రకటనపై రాని జీఓ..

రిటైర్మెంట్ ప్యాకేజీ పెంచాలని టీచర్లు, ఆయాలు డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగ విరమణ పొందిన అంగన్‌వాడీ టీచర్లకు రూ.1లక్ష, హెల్పర్లకు రూ.50వేలు ఇస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. ఈ విషయమై అంగన్‌వాడీలు, ఆయాలు ఆందోళనలు, ధర్నాలు చేపట్టారు. రాష్ట్రంలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జీఓలో ఎలాంటి మార్పులు చేయకుండా అమలులోకి తెచ్చింది. రిటైర్మెంట్ ప్యాకేజీ పెంచాలని, దానిపై స్పష్టత వచ్చేవరకూ విధుల నుంచి తప్పుకునేది లేదని చెబుతున్నారు. కాగా ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'అమ్మమాట–అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క రిటైర్మెంట్ అయ్యే అంగన్‌వాడీ టీచర్‌కు రూ.2లక్షలు, ఆయాకు రూ.1లక్ష చొప్పున బెనిఫిట్స్ ప్రకటించారు. అయితే జీఓ ఇంతవరకూ జారీ కాలేదు.

నెలవారీగా పెన్షన్ అందించాలి



రిటైర్ అయిన అంగన్‌వాడీ టీచర్‌కు నెలకు రూ.5వేలు, ఆయాకు రూ.3వేలు పెన్షన్ ఇవ్వాలి. ప్రభుత్వం ప్రకటించిన విధంగా కాకుండా.. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే అంగన్‌వాడీ టీచర్లకు రూ.3లక్షలు, ఆయాలకు రూ.1.50 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలి.

– బాల్నె స్వరూపారాణి, అంగన్‌వాడీల సంఘం జిల్లా అధ్యక్షురాలు

ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా..



అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలి. 22 ఏళ్లుగా స్టేషన్‌ఘన్‌పూర్‌లో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నాను. గ్రామాల్లో తాము అందిస్తున్న సేవలను గుర్తించి ఆదుకోవాలి.

– మునిగాల రాణి, అంగన్‌వాడీ టీచర్, స్టేషన్‌ఘన్‌పూర్

నిబంధనల మేరకు పనిచేస్తాం..



ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాలు, నిబంధనల మేరకు పనిచేస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో 65 ఏళ్లు నిండిన టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ అమలు చేయాలని ఆదేశాలు వచ్చాయి. మాదగ్గర ఉన్న వివరాల ప్రకారం ప్రభుత్వానికి నివేదిక అందించాం. ఖాళీలపై మాకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదు.

– జయంతి, మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి

ఉపాధ్యాయుల సంక్షేమమే సంఘం ధ్యేయం



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

- పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి

చిల్పూరు: ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్టీయూ ధ్యేయమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. చిల్పూరుగుట్ట శ్రీబుగులు వేంకటేశ్వరస్వామిని బుధవారం సంఘం బాధ్యులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదును జిల్లా అధ్యక్షుడు కొల్ల మహిపాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో 317 జీఓతో నష్టపోయిన స్పౌజ్, స్థానికతను ఇప్పిస్తామని, ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు, వచ్చేనెల వరకు ప్రతీ పాఠశాలకు స్కావెంజర్లను నియమించేలా కృషి చేస్తామని చెప్పారు. మహిళా ఉపాధ్యాయులకు చైల్డ్ కేర్ లీవ్.. రిటైర్మెంట్ వరకు వాడుకునేలా సెలవులు ఇప్పిస్తామని పేర్కొన్నారు. శ్రవణ్‌కుమార్, అశోక్, విజేందర్‌రెడ్డి, రాంబాబు, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బంది సక్రమంగా పనిచేయాలి

పాలకుర్తి టౌన్: పంచాయతీ సిబ్బంది పనులను వేగంగా.. సక్రమంగా చేయాలని డీఆర్‌డీఓ మొగులప్ప అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ రాములు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన జీపీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ అధికారులు, ప్రత్యేకాధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. ప్రతీ బుధవారం జీపీ కేంద్రాలను, గురువారం పాఠశాలలను తనిఖీ చేయాలన్నారు. మంగళ, శుక్రవారం డీఆర్‌టీ–డీఏటీ, వాటరింగ్ డే కార్యక్రమం చేపట్టాలని చెప్పారు. కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని, ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం పాలకుర్తిలో మొక్కలు నాటారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ రవికుమార్, ఉపాధి హామీ పథకం ఏపీఓ మంజుల, కార్యదర్శి వెంకటేశ్వరచారి పాల్గొన్నారు.

లైఫ్ సేవియర్ అవార్డుల ప్రదానం



అవార్డులతో మామిడి రాకేష్, రాజిరెడ్డి

జనగామ: ఈఎంఆర్ఐ గ్రీన్‌హెల్త్ సర్వీసెస్ ద్వారా నిర్వహిస్తున్న 108 అత్యవసర అంబులెన్స్ సేవలకు సంబంధించి లైఫ్ సేవియర్ అవార్డులను జిల్లాకు చెందిన మెడికల్ టెక్నీషియన్ మామిడి రాకేష్, పైలట్ దోమ రాజిరెడ్డి అందుకున్నారు. ఏప్రిల్, మే, జూన్ త్రైమాసికానికి సంబంధించి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వీరికి హైదరాబాద్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యనిర్వహణ అధికారి ఎంఏ.ఖాలిద్ అవార్డులు అందజేశారు. రోడ్డు ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే సకాలంలో స్పందించి క్షతగాత్రులకు తగిన వైద్యం అందిస్తూ అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించినందుకు ఈ అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నసీరుద్దీన్, జనగామ జిల్లా మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా విషయాలపై దృష్టి సారించాలి



కలెక్టర్‌కు పూలమొక్క అందజేస్తున్న జోనల్ ఆఫీసర్ విద్యారాణి

జనగామ రూరల్: ఉపాధ్యాయులు విద్యా విషయాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ జోనల్ ఆఫీసర్, యాదాద్రి జోన్ అధికారి విద్యారాణి అన్నారు. బుధవారం ఆమె కలెక్టర్ రిజ్వాన్ బాషాను మార్యద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. అనంతరం పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆమెను సన్మానించారు. అనంతరం విద్యారాణి మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, ఇతర వసతులు కల్పించాలని, మౌలిక సదుపాయల కల్పనలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని చెప్పారు. రానున్న పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన చేర్యాల మార్కెట్ కమిటీ

బచ్చన్నపేట : చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బచ్చన్నపేట మండలం కట్కూర్ గ్రామానికి చెందిన నల్లనాగుల శ్వేతవెంకటాచారి, అలాగే కోఆప్షన్ సభ్యుడిగా వరంగల్ డీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కె.ఉపేందర్, డైరెక్టర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల పక్షాన నిలిచి మార్కెట్‌ను ప్రగతి పథంలో నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో నూకల బాల్‌రెడ్డి, జంగిటి విద్యానాథ్, జిల్లా సందీప్, మాసపేట రవీందర్‌రెడ్డి, వేముల వెంకట్, కావ్యశ్రీ, బాపురెడ్డి, కామిడి రవీందర్‌రెడ్డి, జంగిడి సిద్దులు, భద్రయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నవలలకు ఆహ్వానం

హన్మకొండ కల్చరల్ : ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహిత్య పురస్కారం -2024 సంవత్సరానికిగాను నవలలను ఆహ్వానిస్తున్నామని అభ్యుదయ రచయిత సంఘం అధ్యక్షులు నిధి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పల్లేరు వీరస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ నవలను ఎంపిక చేసి అక్టోబర్‌లో హనుమకొండలో నిర్వహించే కార్యక్రమంలో రూ. 5వేల నగదు, శాలువ, జ్ఞాపికతో పురస్కారం ప్రదానం చేస్తామని తెలిపారు. 2020 జూలై నుంచి 2024 జూన్ వరకు ప్రచురితమైన మొదటి ముద్రణలు మాత్రమే పంపాలని, అన్ని ప్రాంతాల వారు పంపొచ్చని, వచ్చే నెల 31వ తేదీ లోగా ప్రతులు పంపాలన్నారు. ఇతర వివరాలకు 9701000306 నంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు.

350 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, సిబ్బంది

చెన్నారావుపేట: మండలంలోని ఉప్పరపల్లిలో బుధవారం 350 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన శ్రీధర్‌రెడ్డికి చెందిన సాయిరాం బిన్ని రైస్ మిల్లులో టాస్క్‌ఫోర్స్ అధికారులు స్థానిక పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ. 9లక్షల 10 వేల విలువైన 350 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై గూడ అరుణ్ మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించామని, వారు శాంపిల్స్ తీసుకున్నారన్నారు. సివిల్ సప్లయ్ అధికారులు ఇచ్చే నివేదికను బట్టి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

దంతాలపల్లి: బైక్‌ను ఢీకొని ఒకరి మృతికి కారణమైన సూర్యాపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ వెంకన్నకు తొర్రూరు జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సరిత రెండేళ్ల జైలుశిక్ష , రూ. 2వేల జరిమానా విధించినట్లు ఎస్సై రాజు బుధవారం తెలిపారు. 2015లో మండలంలోని రామానుజపూరం గ్రామానికి చెందిన అక్కిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పని నిమిత్తం బైక్‌పై మండలకేంద్రానికి వచ్చి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో గల పాలేరు వాగు వద్ద సూర్యాపేట వైపు నుంచి దంతాలపల్లికి వస్తున్న బస్సు..బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటపై మృతుడి సోదరుడు మహిపాల్ రెడ్డి ఫిర్యాదు మేరకు అప్పటి ఉమ్మడి నర్సింహులపేట ఎస్సై ప్రసాద్ కేసు నమోదు చేశారు. వాదప్రతివాదనల అనంతరం నేరం రుజువు కావడంతో తొర్రూరు జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సరిత.. బస్సు డ్రైవర్ వెంకన్నకు రెండేళ్ల జైలు శిక్ష, రూ. 2వేల జరిమానా విధించారు. కాగా, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పీపీ గణేశ్ ఆనంద్, కోర్టు కానిస్టేబల్ రాజారాం ను ఉన్నతాధికారులు అభినందించారు.

ఆశలు.. అడియాసలేనా!

- విద్యుత్ సంస్థల్లో ఇంకా మొదలుకాని బదిలీలు
- షెడ్యూల్ విడుదల కోసం ఉద్యోగుల ఎదురుచూపు
- స్పష్టత ఇవ్వని టీజీఎన్పీడీసీఎల్ యాజమాన్యం
- ట్రాన్స్‌కో సీఎండీ మారడం కూడా జాప్యానికి కారణమని ఉద్యోగ వర్గాల్లో చర్చ

హన్మకొండ: తెలంగాణ ప్రభుత్వం అవకాశమిచ్చినా రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో బదిలీలు చేపట్టలేదు. ఫలితంగా తమ ఆశలు అడియాసలు అవుతున్నాయని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. అసలు బదిలీలు జరుగుతాయా? లేదా? అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 22 వరకు ఉద్యోగుల బదిలీలకు అవకాశం కల్పించింది. అయితే ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో వివిధ కారణాలతో బదిలీల ప్రక్రియ చేపట్టలేదు. విద్యుత్ సంస్థల్లోనూ చేపట్టకపోవడంతో ఆ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే బదిలీలకు ఈ నెల 31 వరకు గడువు ఇచ్చినట్లు ఉద్యోగ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

విద్యుత్ సంస్థల పాలక మండళ్లను మార్చిన ప్రభుత్వం..

రాష్ట్రంలో జెన్‌కో, ట్రాన్స్‌కో, టీజీ ఎన్పీడీసీఎల్, టీజీ ఎస్పీడీసీఎల్ విద్యుత్ సంస్థలున్నాయి. ఈ విద్యుత్ సంస్థల్లో బదిలీలు, పదోన్నతులు జరిగిన



ప్రతిసారి ఆయా యాజమాన్యాలు సమిష్టి నిర్ణయం తీసుకుంటాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్ సంస్థల పాలకమండళ్లను మార్చింది. ఐఏఎస్ అధికారులను సీఎండీలుగా నియమించింది. ట్రాన్స్‌కో సీఎండీగా ఉన్న సయ్యద్ ఆలీ ముర్తజా రిజ్వీని బదిలీ చేసి రోనాల్డ్ రోస్‌ను ట్రాన్స్‌కో సీఎండీగా నియమించింది. ఈ క్రమంలో బాధ్యతలు చేపట్టిన రోనాల్డ్ రోస్ బదిలీలపై ఇంకా ఎలాంటి నిర్ణయానికి రాలేదని తెలుస్తోంది. ట్రాన్స్‌కో సీఎండీ మారడం కూడా బదిలీలపై నిర్ణయం తీసుకోవడానికి జరుగుతున్న జాప్యానికి కారణం కావొచ్చని విద్యుత్ ఉద్యోగుల వర్గాలు చర్చించుకుంటున్నాయి.

బదిలీలపై ఎలాంటి సంకేతాలు లేవు..

బదిలీలపై ఎలాంటి సంకేతాలు వెలువడకపోవడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. గతంలో బదిలీలు జరిగినప్పుడు కోల్పోయిన అవకాశాలు ఈ సారైనా దక్కకపోతాయా అని భావిస్తున్న ఉద్యోగుల ఆశలు అడియాసలుగానే మిగిలిపోతున్నాయి. ప్రధానంగా జిల్లా కేంద్రాలు, ప్రధాన నగరాలు, పట్టణాలకు దూరంగా పని చేస్తున్న ఉద్యోగులు జిల్లా కేంద్రాలు, నగరాలు, పట్టణాలకు రావాలని ఆశిస్తున్నారు. జూలై చివరి వారం వచ్చినా షెడ్యూల్ విడుదల కాకపోవడంతో బదిలీలు జరుగుతాయా లేదా అని, యాజమాన్యం నుంచి స్పష్టత లేకపోవడంతో తాము పాత స్థానాల్లోనే కొనసాగాల్సి వస్తుందేమోనని నిట్టూరుస్తున్నారు.

వేయికండ్లతో ఎదురుచూపులు

టీజీ ఎన్పీడీసీఎల్‌లో బదిలీలలు జరిగితే తమకు అనుకూల స్థలాలకు వెళ్లొచ్చని ఆశిస్తున్న ఉద్యోగుల ఆశలు నిరాశలవుతున్నాయి. టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 జిల్లాల్లో దాదాపు 9, 880 మంది ఉద్యోగులున్నారు. హనుమకొండ జిల్లాలో 780, వరంగల్‌లో 440, జనగామలో 425, భూపాలపల్లి, ములుగు జిల్లాలో 405, మహబూబాబాద్‌లో 400, కరీంనగర్‌లో 1,062, జగిత్యాలలో 712, పెద్దపల్లిలో 602, ఖమ్మంలో 771, భద్రాద్రి కొత్తగూడెంలో 514, నిజామాబాద్‌లో 1,304, కామారెడ్డిలో 774, ఆదిలాబాద్‌లో 324, కొమురంభీం ఆసిఫాబాద్‌లో 209, మంచిర్యాలలో 445, నిర్మల్‌లో 437, ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో 203, డీపీఈలో 70, సీవీలో 57 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరిలో 4 సంవత్సరాలు పై బడి ఒకే చోట పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు బదిలీల కోసం వేయికండ్లతో ఎదురుచూస్తున్నారు.

నిలకడగా ఉభయ నదులు..



కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద ప్రవహిస్తున్న గోదావరి



వాజేడు: ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

- స్వల్ప స్థాయిలో ప్రాణహిత, గోదావరి ప్రవాహం
- కాళేశ్వరం వద్ద 11.200 మీటర్ల ఎత్తులో వెళ్తున్న వరద

కాళేశ్వరం : మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాణహిత, గోదావరి ఉభయ నదుల వరద నిలకడగా కొనసాగుతోంది. దీంతో బుధవారం జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి పుష్కరఘాట్ గుండా 11.200 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. ఆ వరద నీరు మేడిగడ్డ బరాజ్ వద్దకు చేరి 7,87,400 క్యూసెక్కులు తరలివస్తోంది. బరాజ్‌లో మొత్తం 85 గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. అన్నారం(సరస్వతి)బరాజ్‌కు ఎగువ నుంచి 16,500 క్యూసెక్కులు రాగా, వచ్చిన నీటిని వచ్చినట్లు మొత్తం బరాజ్‌లోని 66గేట్లు ఎత్తి నీటిని దిగువ కాళేశ్వరం వైపునకు తరలిస్తున్నారు.

పేరూరు వద్ద మళ్లీ పెరుగుతున్న గోదావరి

వాజేడు: మండల పరిధిలోని పేరూరు వద్ద గోదావరి వరద మళ్లీ పెరుగుతోంది. బుధవారం ఉదయం 8 గంటల వరకు 15.45 మీటర్ల మేర తగ్గిన గోదావరి వరద.. సాయంత్రానికి 16.45 మీటర్ల మేర పెరిగింది. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వస్తుండడంతో గోదావరి పెరుగుతున్నట్లు సీడబ్ల్యూసీ సిబ్బంది తెలిపారు. మండలంలోని పూసూరు–ఎడ్జర్లపల్లి, వాజేడు–గుమ్మడిదొడ్డి, పేరూరు–చంద్రుపట్ల, కోయవీరాపురం,



కన్నాయిగూడెం : సమ్మక్క సాగర్ వద్ద పెరుగుతూ ప్రవహిస్తున్న గోదావరి

రహదారులపై గోదావరి ఇంకా ప్రవహిస్తోంది. మండల పరిధిలోని టేకులగూడెం చివరన రేగుమాకు ఒర్రె వద్ద తెలంగాణ, ఛత్తీస్ గఢ్ రహదారిపైకి చేరి ప్రవహిస్తోంది.

సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద కూడా..

కన్నాయిగూడెం : ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామ సమీపంలో నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి మళ్లీ పెరుగుతోంది. రెండు రోజుల నుంచి తగ్గుతూ వచ్చిన గోదావరి బుధవారం మధ్యాహ్నం నుంచి ఎగువ ప్రాంతంలో వరదలు రావడంతో మళ్లీ పెరుగుతోంది. బ్యారేజీలోకి ఉదయం 8,85,600 క్యూసెక్కుల నీరు చేరగా సాయంత్రం 9,75,910 క్యూసెక్కులు చేరింది. బ్యారేజీ వద్ద 59 గేట్లు ఎత్తి అదే మోతాదులో నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 84.10 మీటర్ల నీటి మట్టం కొనసాగుతోంది. దేవాదుల ఇన్‌టెక్‌వెల్ వద్ద 83.30 మీటర్ల నీటి మట్టం కొనసాగుతోంది.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

ములుగు రూరల్: చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని కన్నాయిగూడెంలో చోటు చేసుకుంది. రెండో ఎస్సై రామకృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యాట సాంబయ్య (60) అదే గ్రామానికి చెందిన యాట రమేశ్, పల్లె వేణుతో కలిసి లక్నవరంలో చేపల వేటకు వెళ్లాడు. తెప్ప సాయంతో చెరువులోకి వెళ్లిన సాంబయ్య.. వలలు లాగుతుండగా కాలికి చిక్కుకుని చెరువులో మునిగి మృతి చెందాడు. కొంత సమయం తరువాత సాంబయ్య కనిపించకపోవడంతో రమేశ్, వేణు.. సాంబయ్య కోసం వెతికారు. నీటిలో మునిగిన సాంబయ్య అప్పటికే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

చదువుకోమని తండ్రి మందలించాడని..

- బాలిక ఆత్మహత్య
- గూనిపర్తిలో ఘటన

కమలాపూర్: చదువుకోమని తండ్రి మందలించాడనే కారణంతో మనస్తాపానికి గురైన ఓ బాలిక.. పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూనిపర్తిలో చోటు చేసుకుంది. సీఐ హరికృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బుర్ర హారిక (17) పదో తరగతి వరకు చదువుకుంది. ఇంటర్మీడియట్ చదవడం ఇష్టంలేదని తండ్రికి చెప్పింది. దీంతో ఇంటి దగ్గర ఉండి ఏం చేస్తావు.. చదువుకోమని మందలించాడు. దీనికి మనస్తాపానికి గురైన హారిక మంగళవారం సాయంత్రం పురుగుల మందు సేవించింది. ఈ విషయం అదే రోజు రాత్రి తండ్రికి తెలపగా వెంటనే వరంగల్ ఎంజీఎం తరలించారు. వైద్యులు పరీక్షించి హారిక అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పిల్లలపై ఒత్తిడి పెంచొద్దు

- పార్మర్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు విద్యాధర్
- రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న విద్యాధర్

వరంగల్ స్పోర్ట్స్ : తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి పెంచొద్దని, సహనం పాటిస్తే కచ్చితంగా సత్ఫలితాలు వస్తాయని పార్మర్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు జేబీఎస్ విద్యాధర్ అన్నారు. ఉమ్మడి వరంగల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని ఆఫీసర్స్ క్లబ్‌లో 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్స్ (అండర్ -17) బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులు జరగనున్న చాంపియన్‌షిప్ ప్రారంభోత్సవ వేడుకలకు పార్మర్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారులు జేబీఎస్ విద్యాధర్, కిదాంబి నందగోపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యాధర్ మాట్లాడుతూ క్రీడాకారులు పట్టుదల, క్రమశిక్షణతోపాటు కఠోర శ్రమ చేసినప్పుడే లక్ష్య చేధిస్తారన్నారు. మరో అతిథి నందగోపాల్ మాట్లాడుతూ అంతర్జాతీయ వేదికలపై పీవీ సింధు, సాత్విక్‌సాయిరాజ్ సత్తాచాటుతున్నారని, వారి స్ఫూర్తితో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి ఎం. జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ మూడు రోజులు జరిగే పోటీలకు 140 మంది క్రీడాకారులు, 20 మంది టెక్నికల్ అఫీషియల్స్ హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పింగిళి రమేశ్‌రెడ్డి, కోశాధికారి డి. నాగకిషన్, వరంగల్ క్లబ్ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, క్రీడా పరిశీలకుడు సుధాకర్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎన్. మోహన్‌రావు, అసోసియేషన్ బాధ్యులు, టెక్నికల్ అఫీషియల్స్ కొమ్ము రాజేందర్, వైకుంఠం, రాజ్‌కుమార్, దుర్గాప్రసాద్, విశ్వప్రకాశ్, రాజేశ్, పీసీఎస్ రావు, కిశోర్, పీవీఎల్ కుమార్, శ్యాంకుమార్, భాస్కర్, శైలజ, హరికృష్ణ, శ్యాంప్రసాద్, శ్రీనివాసరెడ్డి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై అవగాహన ఉండాలి

- ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్యోతి

కేయూ క్యాంపస్: బడ్జెట్‌పై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. జ్యోతి అన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ (2024–2025) పై ఆ కళాశాల ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ చర్చలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలోని అన్నిరంగాలను అభివృద్ధి పరిచే విధంగా బడ్జెట్ రూపకల్పన ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం నిధులు ఎక్కువ కేటాయించాలన్నారు. కేయూ పాలకమండలి సభ్యుడు డాక్టర్ చిర్రరాజు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. చర్చ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌కుమార్‌లోథ్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ పూర్తిగా నిరాశ పరిచిందన్నారు. పార్ట్‌టైం లెక్చరర్ డాక్టర్ తిరుణహరిశేషు మాట్లాడుతూ కేంద్రవార్షిక బడ్జెట్‌లో ఆదాయం కంటే అప్పులే ఎక్కువగా కేటాయించారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఆర్. ఆదిరెడ్డి, డాక్టర్ హరిశంకర్, డాక్టర్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

వివక్షలకు వ్యతిరేకంగా పోరాడడమే నాస్తికత్వం

- ద్రవిడ కళగం నేత కుమరేసన్



మాట్లాడుతున్న ద్రవిడ కళగం నాయకుడు కుమరేసన్

హన్మకొండ: వివక్షలకు వ్యతిరేకంగా పోరాడడమే నాస్తికత్వమని ద్రవిడ కళగం నాయకుడు కుమరేసన్ అన్నారు. బుధవారం హనుమకొండ వడ్డేపల్లిలోని పీఆర్ రెడ్డి భవన్‌లో భారత నాస్తిక సమాజం జాతీయ కమిటీ సభ్యులు జె.రవి, ఉప్పులేటి నరేశ్ అధ్యక్షతన భారత నాస్తిక సమాజం తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభ జరిగింది. ఈ సభలో కుమరేసన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ భారతదేశంలో సామాజిక విప్లవాలు, రాజ్యాంగ సవరణలకు కారణమైన పెరియార్ ఉద్యమ భావజాలాన్ని 1970 నుంచి ప్రచారం చేసి ప్రజలను చైతన్యం చేయడంలో నాస్తిక సమాజం వ్యవస్థాపకుడు జయగోపాల్ తన జీవితాన్నే త్యాగం చేశారన్నారు. వి.సి.కె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రొఫెసర్ ఖాసీం, రచయిత గురిజాల రవీందర్, భారత నాస్తిక సమాజం జాతీయ కమిటీ సభ్యులు సాయిని నరేందర్, జె. రవి మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చి దేశంలో మనుధర్మ పాలన తీసుకొచ్చే ప్రమాదముందన్నారు. ప్రగతిశీల శక్తులు, నాస్తికులు, హేతువాదులు మానవీయ విలువల సమాజ నిర్మాణం కోసం ఐక్య ఉద్యమాలు చేయాలన్నారు. సభలో వి.సి.కె పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మచ్చ దేవేందర్, భారత్ బచావో జిల్లా అధ్యక్షుడు వెంగల్ రెడ్డి, భారత నాస్తిక సమాజం నాయకులు జ్యోతికుమార్, చార్వాక, శ్యామల, రామంచ భరత్, గుమ్మడిరాజుల సాంబయ్య, పెండ్యాల సుమన్, వేదాంత మౌర్య, సంతోశ్, స్వప్న, అశోక్, గుత్తికొండ చక్రధర్, రాధండి దేవేందర్, పల్లె ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రమాదరహిత సంస్థగా నిలపాలి

- డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న డీటీసీ శ్రీనివాస్

హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీని ప్రమాదరహిత సంస్థగా నిలపాలని హనుమకొండ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం హనుమకొండలోని ఆర్టీసీ–1 డిపోలో వరంగల్ రీజియన్ ప్రమాదరహిత వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. డీటీసీ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దన్నారు. సరైన విశ్రాంతి తర్వాతే డ్యూటీకి హాజరు కావాలన్నారు. ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను మాట్లాడుతూ సురక్షిత ప్రయాణానికి చిరునామా ఆర్టీసీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే సేఫ్టీ అవార్డులు ప్రతి సంవత్సరం అందుకుంటుందన్నారు. డ్రైవర్లలో క్రమశిక్షణ, అప్రమత్తత పెంచడానికి ప్రతి సంవత్సరం జనవరిలో రోడ్డు భద్రత పక్షోత్సవాలు, జూలైలో ప్రమాదరహిత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ రోడ్డు మీద వెళ్లే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వాహనాలు నడపాలన్నారు. ప్రయాణికుల జీవితం బస్సు డ్రైవర్ చేతిలో ఉందని, తన బాధ్యతను గుర్తెరిగి బస్సు నడపాలన్నారు. కార్యక్రమంలో వరంగల్–1 డిపో మేనేజర్ వంగాల మోహన్ రావు, సూపర్ వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

కాంగ్రెసోళ్లవి తుపాకీరాముని మాటలు

- పథకాల పేరిట ప్రజల చెవుల్లో పూలు పెట్టారు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా కుట్టు మిషన్ల పంపిణీ



మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు, పక్కన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

జనగామ: ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని అడుగుతుంటే .. కాంగ్రెస్ నాయకులు తుపాకీ రాముని మాటలు మాట్లాడుతూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా బుధవారం జనగామ మండలం యశ్వంతాపూర్ సత్యసాయి కన్వెన్షన్‌లో పోచంపల్లి ఫౌండేషన్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో లింగాలఘణపురం మండలంలోని వెయ్యి మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ మహిళా సంఘాల ఆర్థిక బలోపేతం కోసం నాడు ఎన్టీఆర్, నేడు కేసీఆర్ కృషి చేశారన్నారు. గృహలక్ష్మి, రైతుబంధు, రుణమాఫీ, కల్యాణలక్ష్మిలో అదనంగా తులం బంగారం అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రజల చెవుల్లో పూలు పెట్టారన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనే కేటీఆర్ బర్త్‌డే రోజు కుట్టు మిషన్లు అందిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతోనే తాను ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ఇందులో పది వేల మందికి శిక్షణ ఇప్పించానన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజయ్య, దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, మాజీ ఎంపీపీ జయశ్రీ, భాగ్యలక్ష్మి, తిర్మల్‌రెడ్డి, శరత్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి,రాజు పాల్గొన్నారు.

మోడల్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంగా ఎల్కతుర్తి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఎల్కతుర్తి ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీజీఎంలు, జీఎంల సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొడవాటి లైన్లలో సమస్యలు ఏర్పడినప్పుడు వాటిని పరిష్కరించడానికి ఆ లైన్ మొత్తం పెట్రోలింగ్ చేసుకుంటూ వెళ్లడం వల్ల ఆలస్యం అవుతోందన్నారు. అయితే ఈ సమస్యను అధిగమించడానికి ఫాల్ట్ ప్యాసేజీ ఇండికేటర్లు అమర్చుతున్నట్లు తెలిపారు. వీటి ద్వారా సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరించొచ్చన్నారు. ములుగు, నర్సంపేటలో ప్రతి 4 కిలో మీటర్లకు ఫాల్ట్‌ప్యాసేజీ ఇండికేటర్ అమర్చుతున్నామన్నారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో రియల్ టైం మానిటరింగ్ అండ్ కంట్రోలింగ్ టెక్నాలజీని తీసుకొస్తున్నామని, ఈ టెక్నాలజీతో సబ్‌స్టేషన్లలో లోడ్, పవర్ ఫాక్టర్, ట్రిప్పింగ్స్, బ్రేక్‌డౌన్లు, ఎల్‌సీ తదితర పూర్తి సమాచారం తెలుస్తుందన్నారు. సమస్యను సులభంగా గుర్తించి అదే వేగంతో పరిష్కరించొచ్చన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సీజీఎంలు కె.కిషన్, రాజుచౌహాన్, కె.ఎస్.గుట్ట, జీఎంలు గౌతమ్ రెడ్డి, నాగప్రసాద్, శ్రీనివాస్, డీఈ (ఐటీ) అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వేయిస్తంభాల ఆలయంలో సంకటచతుర్థి పూజలు



మూలగణపతికి హరిద్రాకుంకుమలతో అభిషేకం చేస్తున్న గంగు ఉపేంద్రశర్మ

హన్మకొండ కల్చరల్ : శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో ఆషాఢ బహుళ చతుర్థి తిథిని పురస్కరించుకుని బుధవారం సంకటహరచతుర్థి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మణికంఠ, అర్చకులు ప్రణవ్ మూలమహాగణపతికి గణపతిసూక్త మూలమంత్రములతో హరిద్రాకుంకుమ, గంధోదకాలతో అభిషేకం, పంచామృతాభిషేకం, అర్చనలు నీరాజనమంత్రపుష్పం, నైవేద్యం సమర్పించి మహాహారతి నిర్వహించారు.

'శతాధిక' వృద్ధురాలి మృతి



ఈరవ్వ(ఫైల్)

నల్లబెల్లి: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మూడుచెక్కలపల్లి గ్రామానికి చెందిన 'శతాధిక' వృద్ధురాలు బరిగెల ఈరవ్వ(118) మృతి చెందింది. బుధవారం ఉదయం స్నానం చేసి పాలు తాగుతూ అస్వస్థతకు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేందుకు యత్నిస్తుండగా మృతి చెందింది. కాగా, ఈరమ్మకు ముగ్గురు కుమారులు, కుమార్తెతో పాటు మనువలు, మనువరాళ్లు దాదాపు 30 మందికి పైగా ఉన్నారు.

ఆస్పత్రి గడప తొక్కని ఈరమ్మ..

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో పాతికేళ్లు దాటితే చక్కెర వ్యాధి, రక్తపోటు అంటూ ఆస్పత్రుల చుట్టుతిరుగుతూ జీవనం గడుపుతున్న తరుణంలో శతాధిక వృద్ధురాలు ఈరమ్మ సూదిమందు కూడా లేకుండా జీవించింది. మంగళవారం వరకు తనపని తానే చేసుకుంటూ ఆరోగ్యంగా ఉంది. కాగా, 118 ఏళ్లలో ఏనాడు ఆస్పత్రి గడప తొక్కలేదని, కనీసం సూదిమందు అంటే కూడా తెలియదని కుటుంబీకులు తెలిపారు.